సైన్స్‌లో విద్యార్థుల ప్రతిభ అభినందనీయం

విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి, డిసెంబర్ 17: విద్యార్థులు సైన్స్‌లో ప్రతిభ చూపడం అభినందనీయమని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. చెకుముకి సైన్స్ సంబురాల్లో లింగంపేట్ మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు రాహుల్, ముఖేశ్, అబ్దుల్ రెహ్మాన్ మూడో స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా వారిని కలెక్టర్ మంగళవారం శాలువాలు కప్పి సన్మానించారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి దయానంద్, డీఈవో రాజు, ఆర్ఎల్‌సీ కిరణ్ గౌడ్, ప్రిన్సిపాల్ వెంకటరమణ, స్కూల్ కో-ఆర్డినేటర్ రామ్‌గోపాల్, గైడ్ టీచర్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను పక్కాగా నిర్వహించాలి..

భిక్కనూరు, డిసెంబర్ 17: ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పక్కాగా నిర్వహించాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. భిక్కనూరు మండలంలోని అంతంపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను ఆయన మంగళవారం పరిశీలించారు. తహసీల్దార్ శివప్రసాద్, ఎంపీడీవో రాజ్‌కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెరిగిన రేట్లను అమలుచేయాలి

కామారెడ్డి,డిసెంబర్ 17: పెరిగిన హమాలీ రేట్లను అమలుచేయాలని కోరుతూ సివిల్ సప్లై హమాలీలు, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కామారెడ్డిలో సివిల్ సప్లై డీఎంజీ రాజేందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. నేడు సివిల్ సప్లై కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు బాలరాజ్, రవి, భీమయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు దశరథ్ పాల్గొన్నారు.

'టీఎన్‌జీవోస్'ల బాధ్యతల స్వీకరణ

అభినందనలు తెలుపుతున్న తోటి ఉద్యోగులు

కామారెడ్డి, డిసెంబర్ 17: టీఎన్జీవోస్ నూతన కార్యవర్గ సభ్యులు మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. కామారెడ్డిలోని టీఎన్జీవోస్ భవనంలో ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా వెంకట్‌రెడ్డి, కార్యదర్శిగా నాగరాజు, అసోసియేట్ అధ్యక్షుడిగా చక్రధర్, కోశాధికారిగా దేవరాజు, ఉపాధ్యక్షులుగా సాయిలు, శ్రావణ్, లక్ష్మణ్, రాజ్యలక్ష్మి, సంయుక్త కార్యదర్శులుగా గణేశ్, రమణ, అబ్దుల్ ఖాదర్, రాజమణి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా సంతోష్ కుమార్, పబ్లిసిటీ సెక్రటరీగా రాజ్ కుమార్, కార్యవర్గ సభ్యులుగా శ్రీకాంత్, సాయినాథ్, రంజిత్, దత్తాత్రి ప్రమాణ స్వీకారం చేశారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

భిక్కనూరు, డిసెంబర్ 17: భిక్కనూరు గ్రంథాలయానికి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పురం రాజమౌళి రూ.20వేల విలువైన పుస్తకాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి శాలువా కప్పి సన్మానించారు. రాజమౌళిని పాఠకులు అభినందించారు.

రామారెడ్డిలో..

భిక్కనూరులో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మాచారెడ్డిలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

- అన్నదాతలను బేషరతుగా విడుదల చేయాలి
- కాంగ్రెస్ నిరంకుశ పాలనపై బీఆర్ఎస్ ఆగ్రహం
- అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాల అందజేత

నమస్తే తెలంగాణ యంత్రాంగం, డిసెంబర్ 17: లగచర్ల రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు అంబేద్కర్ విగ్రహాలకు వినతిపత్రాలను అందజేశారు. కాంగ్రెస్ నిరంకుశ పాలనను తీవ్రంగా ఖండించారు. రైతులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం దారుణమన్నారు. అరెస్టు చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బిచ్కుందలో నిర్వహించిన కార్యక్రమంలో జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొన్నారు. పలు మండలాల్లో బీఆర్ఎస్ నాయకులు పాల్గొని.. కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.

కామారెడ్డి మండలం చిన్న మల్లారెడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

బీబీపేటలో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

బాన్సువాడలో..

రాజంపేటలో..

తాడ్వాయిలో..

ఎల్లారెడ్డిలో..

కొనసాగుతున్న సమ్మె

కామారెడ్డి/ బాన్సువాడ రూరల్, డిసెంబర్ 17: సమగ్ర శిక్ష ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళవారం కొనసాగింది. సమ్మె శిబిరం వద్ద పెయింటింగ్ వేసి, నిజాంసాగర్ చౌరస్తాలో మానవహారం నిర్మించి నిరసన తెలిపారు. తమ హామీలు నెరవేర్చే వరకు ఆందోళన కొనసాగుతుందని ఈ సందర్భంగా వారు స్పష్టంచేశారు. కోనాపూర్ కాంప్లెక్స్ పరిధిలోని ఉపాధ్యాయులు మద్దతు తెలిపారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

మాచారెడ్డి, డిసెంబర్ 17: మండలంలోని గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్‌లోని కో-ఆపరేటివ్ బ్యాంక్ ఎదుట మంగళవారం ఒక గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్సై అనిల్ తెలిపారు. మృతుడి వయస్సు దాదాపు 50 ఏండ్ల వరకు ఉంటుందని తెలిపారు. మృతదేహానికి సంబంధించి ఏమైనా వివరాలు తెలిస్తే మాచారెడ్డి పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులు లక్ష్యం కలిగి ఉండాలి

కామారెడ్డి, డిసెంబర్ 17: విద్యార్థులు లక్ష్యం కలిగి ఉండాలని ఇంపాక్ట్ సర్టిఫైడ్ ట్రైనర్ మోటివేషనల్ స్పీకర్ రమేశ్ అన్నారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఏర్పాటుచేసిన వ్యక్తిత్వ వికాస అవగాహన కార్యక్రమంలో ఆయన విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం గంగాకిషన్ తదితరులలు పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

బాన్సువాడ రూరల్, డిసెంబర్ 17: నర్సరీల్లో మొక్కల పెంపకంపై ఉపాధి హామీ సిబ్బంది దృష్టి సారించాలని అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావు అన్నారు. మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లోని నర్సరీలను ఆయన మంగళవారం పరిశీలించారు. దేశాయిపేట్ గ్రామంలో నిర్మిస్తున్న గేదెల షెడ్డును పరిశీలించారు. కొలతల ప్రకారం నిర్మించాలని లబ్ధిదారులకు సూచించారు. ఏపీవో గంగాధర్, టీఏ గోపాల్, ఎఫ్ఏలు రాము, పోచీరాం తదితరులు ఉన్నారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది ముందస్తు అరెస్టు

బిచ్కుందలో పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్ట్ చేసిన పోలీసులు

బిచ్కుంద, డిసెంబర్ 17 : గ్రామ పంచాయతీ కార్మికుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళుతున్న బిచ్కుంద గ్రామ పంచాయతీ కార్మికులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు సురేశ్ గొండ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ముందస్తుగా అరెస్టు చేయడం శోచనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి; కనీస వేతన రూ.18వేలు ఇవ్వాలని డిమాండ చేశారు. అరెస్టు అయిన వారిలో మాణిక్, లక్ష్మయ్య, భూమయ్య, మారుతి, నంది సాయిలు తదితరులు ఉన్నారు.

రామారెడ్డి, డిసెంబర్17: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన గ్రామ పంచాయతీ మల్టీ పర్‌పస్ సిబ్బంది చలో హైదరాబాద్ వెళ్లాల్సిన క్రమంలో పోలీసులు వారిని వెళ్లకుండా ముందస్తు అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో మండల అధ్యక్షుడు తోకల శ్రీధర్, ఉపాధ్యక్షుడు రాజేందర్, గంగరాజు, శంకర్, రాజయ్య, లింబాద్రి, రమేశ్ తదితరులు ఉన్నారు.

బీబీపేట్, డిసెంబర్ 17: బీబీపేట మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల గ్రామ పంచాయతీ కార్మికులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయా గ్రామాల పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసిన నాయక్ పోడ్‌లు

సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేస్తున్న నాయక్‌పోడ్‌లు

నిజాంసాగర్/ బాన్సువాడ రూరల్, డిసెంబర్ 17 : కొన్ని మండలాల్లో అధికారులు నాయక్‌పోడ్‌లకు కుల సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని జిల్లా ఆదివాసీ నాయక్ పోడ్ కులస్తుల గౌరవ అధ్యక్షుడు గాండ్ల రామచంద్ర ఆధ్వర్యంలో మంగళవారం బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. సమస్యలపై సబ్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో జిల్లా అధ్యక్షుడు పెంటయ్య తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I, JAKKA CHINNA LAXMI, W/o. Jakka Gangadhar, R/o. 5-8-287/4, Ashok Nagar Cly., Kamareddy Dist-503 111, TS. Changed My Name to JAKKA LAXMI, W/o. Jakka Gangadhar. NT-327129

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ 4 లైన్ల క్లాసిఫైడ్ 200/- మాత్రమే, ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సర్వేలో వివరాలు పక్కాగా సేకరించాలి

లింగంపేట/గాంధారి/పెద్దకొడప్‌గల్/ రాజంపేట, డిసెంబర్17: ఇందిరమ్మ గృహాల లబ్ధిదారుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేలో వివరాలు పక్కాగా సేకరించాలని లింగంపేట మండల ప్రత్యేకాధికారి, డీఆర్డీవో సురేందర్ సూచించారు. మంగళవారం మండలంలో నిర్వహిస్తున్న సర్వేను పరిశీలించారు. గాంధారి మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేను ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు పరిశీలించారు. పెద్దకొడప్‌గల్‌లో మండల ప్రత్యేకాధికారి కిషన్ తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి పరిశీలించారు. రాజంపేటలో సర్వేను జడ్పీ సీఈవో చంద్రనాయక్ పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో రఘురాం ఉన్నారు.

మూడు గ్రామాల్లో చోరీ.. నగదు, బంగారు ఆభరణాల అపహరణ

జావిద్ ఇంట్లో దుండగులు ధ్వంసం చేసిన బీరువా

లింగంపేట, డిసెంబర్17: మండల కేంద్రంలోని కోత్వాల్ గల్లీలో మంగళవారం తెల్లవారుజామున రెండు నివాస గృహాల్లో చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రియాజ్ అనే వ్యక్తి నివాస గృహంలో బీరువాలో దాచిన వెండి వస్తువులు, నగదుతో పాటు పట్టు చీరలు అపహరించుకుపోయారు. అలాగే జావీద్ నివాస గృహంలో బీరువాలో దాచిన బంగారు గొలుసు, కమ్మలు, 14వేల రూపాయల నగదు అపహరించుకుపోయారు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి చోరీకి పాల్పడినట్లు కాలనీ వాసులు తెలిపారు. అలాగే పర్మళ్ల గ్రామంలోనూ చోరీకి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. వారి కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంట బాలమణి ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లింది. తెల్లవారు జామున తాళం పగులగొట్టిన దొంగలు ఇంట్లోంచి అర తులం బంగారం, వెండి ఉంగరాలు, పట్టగొలుసులు చోరీ చేశారు. చోరీ విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనా స్థలాన్ని సందర్శించినట్లు వారు తెలిపారు. లింగంపేటలో చోరీ జరిగిన విషయం వాస్తవమేనని, బాధితులు ఫిర్యాదు చేయలేదని ఎస్సై సుధాకర్ తెలిపారు.

దేవునిపల్లిలో చోరీ..

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 17: మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం తాళం వేసిన ఇంట్లో చోరీ జరిగినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. ఎస్సై తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన దుంపల బాల్‌రాజ్ హైదరాబాద్‌లో డ్రైవింగ్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 5వ తేదీన బాల్‌రాజ్ దేవునిపల్లిలోని తన ఇంటికి వచ్చి తిరిగి హైదరాబాద్ వెళ్లాడు. మంగళవారం ఉదయం బాల్‌రాజ్ ఇంటి పక్కన ఉండే జగదీశ్ ఫోన్ చేసి మీఇంటికి ఉన్న తాళాలను ఎవరో పగలగొట్టారని తెలుపగా బాల్‌రాజ్ కుటుంబ సభ్యులు దేవునిపల్లికి వచ్చి ఇంటిని పరిశీలించగా ఇంట్లోని బీరువా తలుపులు పగులగొట్టబడి ఉన్నాయి. బీరువాలోని 80 తులాల వెండి ఆభరణాలు దొంగిలించినట్లు గ్రహించిన బాల్‌రాజ్ పోలీస్‌స్టేషన్‌లో చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భగవద్గీత పుస్తకాల పంపిణీ

లింగంపేట, డిసెంబర్17: మండలంలోని ముంబాజీపేట తండా, కొండాపూర్ తండాలో 40 మందికి భగవద్గీత పుస్తకాలు పంపిణీ చేసినట్లు గిరిజన యువకుడు నరేశ్‌నాయక్ మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో ఆధ్యాత్మికత పెంచడానికి పుస్తకాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఆయన వెంట తండావాసులు మంజ వెంకట్రాం, ధరావత్ శివ, మంజ ఆత్మరామ్ తదితరులు ఉన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

పెద్ద కొడప్‌గల్, డిసెంబర్ 17: మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో మండల ప్రత్యేకాధికారి కిషన్, తహసీల్దార్ దశరథ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి కలిసి మంగళవారం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారి కిషన్ మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించామన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అధికారులవెంట వైస్ ప్రిన్సిపాల్ నాగరాణి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 17: ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని ఎంఈవో వెంకటేశం ఆదేశించారు. మంగళవారం ఎల్లారెడ్డి పట్టణంలోని జడ్పీహెచ్ఎస్ బాలికలతో ఏర్పాటు చేసిన ప్రాథమిక స్థాయి కాంప్లెక్స్ సమాశంలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా జట్టు

గాంధారి, డిసెంబర్ 17: సీఎం కప్ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు జిల్లా బాలబాలికల జట్లను ఎంపిక చేసినట్లు ఆర్గనైజర్ సెక్రటరీ లక్ష్మణ్ రాథోడ్ మంగళవారం తెలిపారు. మండల కేంద్రలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌లో జరిగిన ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన ఆయా మండలాలకు చెందిన బాలబాలికలను అండర్-23 బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 23 నుంచి హైదరాబాద్‌లో జరగనున్న పోటీల్లో జిల్లా జట్టు తరపున పాల్గొంటారన్నారు. క్రీడాకారులను పలువురు అభినందించారు.

పశు వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

లింగంపేట, డిసెంబర్ 17: గ్రామాల్లో ఏర్పాటు చేసిన పశు వైద్యశిరాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పశు వైద్యాధికారి సంజయ్ సూచించారు. మండలంలోని మోతె గ్రామంలో మంగళవారం ఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భకోశ సంబంధిత వ్యాధులు కలిగిన పశువులు చూడి కట్టవని, గర్భకోశ వ్యాధుల నివారణ చికిత్స చేయించాలని సూచించారు. కార్యక్రమంలోఎల్లారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మారెడ్డి రజితారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ రాజు, పశువైద్యాధికారులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పద్మశాలీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పద్మ శ్రీకాంత్

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 17: పద్మశాలీ సంఘ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఎల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్ ఎంపిక య్యారు. మంగళవారం హైదరాబాద్ హరిహర కళాభవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీ సంఘ నూతన కమిటీలో భాగంగా సంయుక్త కార్యదర్శిగా పద్మ శ్రీకాంత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

నేడు పోచారం నీటి విడుదలపై తైబందు సమావేశం

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 17: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పోచారం ప్రాజెక్టు నుంచి యాసంగి పంటలకు నీటి విడుదలపై తైబందు సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు.

జిల్లాలో రూ.140కోట్ల విద్యుత్ బకాయిలు

■ జిల్లా ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్‌కుమార్

సమస్యల పరిష్కార వేదికలో ఫోరం సభ్యులకు ఫిర్యాదు చేస్తున్న రైతులు

నాగిరెడ్డిపేట, డిసెంబర్ 17: జిల్లావ్యాప్తంగా.. విద్యుత్తు వినియోగదారుల నుంచి రూ.140 కోట్ల బకాయి ఉన్నట్లు జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని బంజారా సెక్షన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదికలో ఆయ న పాల్గొన్నారు. విద్యుత్తు సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 4 లక్షల 37 వేల 137 కనెక్షన్లు ఉండగా, అందులో లక్షా 12వేల వ్యవసాయ కనెక్షన్లు ఉన్నాయన్నారు. వ్యవసాయ కనెక్షన్ బిల్లులు రూ. మూడు కోట్ల పాతబకాయిలు ఉండగా, రూ.కోటి 25 లక్షలు వసూలు చేశామన్నారు. జిల్లాలో బీపీఎల్ (బిలో పావర్టీ లైన్) వారికి రూ.970లకే ఇంటి కనెక్షన్ ఇస్తున్నామని, అవసరం ఉన్నవారు ఈ నెలాఖరులోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మండలంలోని విద్యుత్ వినియోగదారుల నుంచి 17 ఫిర్యాదులు రాగా, ఏడు సమస్యలను వెంటనే పరిష్కరించామన్నారు. మిగతా వాటిని నిర్ణీత గడువులో పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు ఎరుకల నారాయణ, రామకృష్ణ, లకావత్ కిషన్, మర్రిపల్లి రాజాగౌడ్, ఏడీ నాగరాజు, ఏఈ నాగరాజు, లైన్ ఇన్‌స్పెక్టర్ సురేందర్, విద్యుత్తు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయాలి

లింగంపేట(తాడ్వాయి), డిసెంబర్ 17: ఇంటర్ చదువుతున్న విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయాలని జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం అధ్యాపకులకు సూచించారు. తాడ్వాయిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. 90 రోజుల ప్రణాళికతో నిత్యం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వచ్చే ఫిబ్రవరిలో ప్రీఫైనల్, ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయని తెలిపారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ యూసుఫ్ హుస్సేన్, అధ్యాపకులు, సిబ్బంది ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల లిస్ట్ ప్రదర్శన

ఎల్లారెడ్డి రూరల్, డిసెంబర్ 17: ఎల్లారెడ్డి పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాల చివరిప్రతిని ఎంపీడీవో ప్రకాశ్ మంగళవారం ప్రదర్శనకు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు ఈ లిస్ట్‌లో ఉన్న కేంద్రాలు మాత్రమే పనిచేస్తాయని తెలిపారు. ఆయనతో పాటు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

నాగిరెడ్డిపేట, డిసెంబర్17: మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఓటరు లిస్ట్‌ను నోటీస్‌బోర్డుపై ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. త్వరలో నిర్వహించనున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఓటరు లిస్ట్ తుది జాబితాను సిద్ధం చేశామని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వినోద్, సీనియర్ అసిస్టెంట్ ప్రకాశ్, జూనియర్ అసిస్టెంట్ లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులో నిందితుల రిమాండ్

లింగంపేట, డిసెంబర్ 17: గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్న ఆరుగురి నిందితులను పట్టుకున్నట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. మండలంలోని రాంపల్లి కోన తండాకు చెందిన దేవసోత్ శంకర్ ఇంటి వద్ద గంజాయి సాగు చేస్తూ విక్రయించే వాడు. శంకర్ సాగు చేసిన గంజాయి మండలంలోని బాయంపల్లి గ్రామానికి చెందిన అంబెపు సతీశ్, కోర్పోల్ గ్రామానికి చెందిన పొట్టోళ్ల ఆస్టిన్‌కు ఇవ్వగా వారు విక్రయించే వారు. సతీశ్, ఆస్టీన్‌ల స్నేహితులు కామారెడ్డికి చెందిన పిడుతల శ్రీకాంత్, అడ్లూర్ ఎల్లారెడ్డికి చెందిన ఇంద్రసేనారెడ్డి, కామారెడ్డి పట్టణానికి చెందిన బట్టు సాయికృష్ణకు విక్రయించే వారు. రాంపల్లి కోన తండాకు గంజాయి కొనుగోలుకు వచ్చినట్లు పక్కా సమాచారం మేరకు సోమవారం సాయంత్రం రాంపల్లి కోనతండాకు వెళ్లగా అక్కడ వీరు పట్టు బడ్డారు. వీరి వద్ద నుంచి ఆరు సెల్‌ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు, 1.315 గ్రాముల ఎండు గంజాయితోపాటు ఒక గంజాయి మొక్క స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆరుగురు నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు.

బాలుడిపై ఎలుగుబంటి దాడి

■ కాలుకు తీవ్ర గాయాలు

■ జిల్లా దవాఖానకు తరలింపు

దాడిలో గాయపడిన బాలుడు

ఎడపల్లి, డిసెంబర్ 17 : నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామంలో ఓ బాలుడిపై ఎలుగుబంటి దాడి చేయగా..జిల్లా కేంద్ర దవాఖానకు తరలించి చికిత్స అందించారు. కుర్నాపల్లికి చెందిన అశ్విత్ (12) మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో కాలకృత్యాల కోసం గ్రామశివారులోని చెరువు కట్టపై నుంచి వెళ్తుండగా వెనుక నుంచి ఎలుగుబంటి ఒక్కసారిగా దాడి చేసింది. దీంతో ఆందోళనకు గురైన బాలుడు అక్కడి నుంచి పరిగెత్తుకొని తప్పించుకున్నాడు. ఎలుగు బంటి దాడిలో బాలు డి కాలుకు తీవ్ర గాయాలు కావడంతో కుటుంబీకులు వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. దాడి విషయం తెలుసుకున్న ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకొని ఎలుగుబంటి పాద ముద్రలను డీ-46 కెనాల్ పై గుర్తించారు. రెండు, మూడు రోజుల్లో రెక్కీ నిర్వహించి ఎలుగుబంటిని పట్టుకుంటామని, అంతవరకు గుంపులు గుంపులుగా వెళ్లాలని గ్రామస్తులకు ఆయన సూచించారు.